ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
సోమవారం 4 ఆగస్టు 2025



చంద్రబాబు రైతుల పక్షపాతి



వైసీపీ వాళ్లు చంద్రబాబును రైతులకు వ్యతిరేకి అని చేస్తున్న ప్రచారంలో నిజం లేదని అన్నదాత సుఖీభవ ద్వారా నిరూపితమైంది. తాను రైతుల పక్షపాతి అని ఆయన నిరూపించుకున్నారు. చెప్పినట్లుగానే తొలి విడత నిధులు వేశారు. భవిష్యత్తులో వ్యవసాయంలో అనేక మార్పులు తెచ్చి చంద్రబాబు రైతులకు మేలు చేస్తారన్న నమ్మకం పెరిగింది.

- గొల్ల కిశోర్ నాయుడు, దొడ్డిపల్లె, పీలేరు మండలం

బొప్పాయి తోటను దున్నేసిన రైతు

● ఎకరాకు లక్ష ఖర్చు చేసినా పెట్టుబడి రాని వైనం



కేఏస్ అగ్రహారంలో ట్రాక్టర్‌తో బొప్పాయి తోటను దున్నేస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తనకు ఉన్న రెండు ఎకరాల్లో బొప్పాయి తోట సాగు చేశాడు ఓ రైతు. కాయలు దిగుబడి వచ్చే సరికి ధరలు పతనమయ్యాయి. ఎకరాకు ఖర్చు సుమారుగా లక్ష వచ్చింది. సాగుకు చేసిన పెట్టుబడి కూడా రాకపోవడంతో ఆ రైతు ఏకంగా రెండు ఎకరాల్లో ఉన్న బొప్పాయి తోటను శనివారం సాయంత్రం ట్రాక్టర్‌తో దున్నేశాడు. చిట్వేలి మండలంలోని కేఏస్ అగ్రహారం గ్రామానికి చెందిన చెంజి నాగరాజు అనే రైతు తనకు ఉన్న రెండు ఎకరాల్లో బొప్పాయి పంటను సాగు చేశాడు. దున్నకాలు, ఎరువులు, పురుగు మందులు, కూలీలు తదితర వాటికి రూ.1.40 నుంచి రూ.2 లక్షలు ఖర్చు వచ్చింది. పెట్టిన పెట్టుబడి కన్నా ఎక్కువగా వస్తుందని ఆశించాడు. అయితే దిగుబడి వచ్చే సరికి ధరలు పతనమయ్యాయి. దీంతో గిట్టుబాటు కాదని ఏకంగా తోటను ట్రాక్టర్‌తో దున్నించేశాడు. రైతుల కష్టాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదని, దళారులు రైతుల రక్తాన్ని తాగుతున్నారని, దళారుల చేతుల్లోనే అన్ని రకాల పంటలు ఉన్నాయని, పాలకులు, అధికారులు చొరవ తీసుకుని రైతులకు న్యాయం చేయాలని రైతు నాగరాజు కోరుతున్నాడు.

పది రోజుల్లో ఆరు సెలవులు

కలికిరి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు నెలలో పది రోజుల వ్యవధిలో ఆరు సెలవులు రానున్నాయి. నెలలో మొత్తం పది రోజులు సెలవులుండగా అందులో పది రోజుల వ్యవధిలో ఆరు సెలవులు రావడం అరుదుగా జరుగుతుంది. ఆగస్టు 8వ తేదీ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం, 9న రెండవ శనివారంతో పాటు రాఖీ పౌర్ణమి, 10వ తేదీ ఆదివారం సెలవులున్నాయి. ఆ తరువాత మళ్లీ 15వ తేదీ శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం, 16 శనివారం శ్రీకృష్ణాష్టమి, 17 ఆదివారం రానున్నాయి. దీంతో మొత్తం పది రోజుల మధ్యలోనే ఆరు సెలవు దినాలున్నాయి. ఇవి కాకుండా మరో మూడు ఆదివారాలు, 27వ తేదీ వినాయక చవితి పండుగలు రావడంతో ఆగస్టులో మొత్తం పది రోజులు సెలవులున్నాయి. శ్రావణ మాసంలో వివిధ రకాల శుభ కార్యాలు వరుసగా రావడంతో సెలవులు కూడా కలిసొచ్చాయి.

అన్నదాత సుఖీభవ...



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): తాము అధికారంలోకి వస్తే అర్హులైన ప్రతి రైతుకు పెట్టుబడి సాయంగా ప్రతి సంవత్సరం రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి చంద్రబాబు నిలబెట్టుకున్నారు. అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ 2025-26 పథకం పేరుతో శనివారం రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన రైతుల అకౌంట్లలోకి తొలివిడతగా రూ.7 వేలు జమ చేశారు. జిల్లాలో 1,88,408 మంది రైతులకు 127.89 కోట్ల రూపాయలు జమ అయ్యాయి. తాను రైతుల పక్షపాతిని అని.. చంద్రబాబు నిరూపించుకున్నారు. ఈ నిధులు తమ అకౌంట్లలో పడడంతో జిల్లా వ్యాప్తంగా రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ డబ్బు వ్యవసాయ పనులకు వినియోగించుకుంటామని పేర్కొంటున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతితో తమ అభిప్రాయాలను పంచుకున్న పలువురు రైతులు..

వ్యవసాయ కూలీల ఖర్చులకు ఉపయోగపడింది



నా ఖాతాలో అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ యోజన పథకం కింద మొత్తం రూ.7 వేలు జమ అయ్యాయి. ప్రస్తుతం నా పొలంలో తమలపాకు సాగు కోసం పనులు చేస్తున్నాం. ఈ సమయంలో ప్రభుత్వం అందించిన సొమ్ము వ్యవసాయ కూలీల ఖర్చులకు ఉపయోగపడుతుంది. వ్యవసాయ పనుల సమయంలో పెట్టుబడి సహాయకంగా కొంత డబ్బులు రావడం సంతోషంగా ఉంది.

- నిడమలూరి రామకృష్ణ, చిన్నఓరంపాడు

ఉచితాల కన్నా సబ్సిడీ ఇస్తే సంతోషం



ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకంతో నా అకౌంట్‌కు రూ.7 వేలు జమ చేశారు. సంతోషమే, అయితే ఉచితం కన్నా రైతులకు సబ్సిడీ పథకాలు అందిస్తే బాగుంటుంది. ఉచిత ఇన్సూరెన్సు పథకం అమలు చేస్తే రైతులు వేసిన పంటలు నష్టపోతే సబ్సిడీ వర్తించేలా ఏర్పాటు చేయాలి. ఉచిత పథకాల ద్వారా వచ్చిన డబ్బులతో ఏదో ఒక అవసరానికి వాడేస్తున్నాం. రైతులు వాడే యూరియా, ఎరువులు, క్రిమిసంహారక మందులు సబ్సిడీ ద్వారా అందించాలి. యాంత్రీకరణ పరికరాలు ప్రతి రైతుకు అందేలా చూడాలి. ప్రస్తుతం వ్యవసాయం పెట్టుబడి ఖర్చులు పెరిగాయి. ప్రభుత్వం దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులకు సబ్సిడీల ద్వారా పథకాలను చేరువ చేస్తే మరింత సంతోషంగా ఉంటుంది.

- రెడ్డెప్పరెడ్డి, కత్తివాండ్లపల్లె, గున్నికుంట్ల గ్రామం

హామీలు నెరవేరుస్తున్న చంద్రబాబుకు కృతజ్ఞతలు



సూపర్ సిక్స్ హామీలు నెరవేరుస్తున్నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు మా అందరి తరఫున కృతజ్ఞతలు. నాకు అన్నదాత సుఖీభవతో పాటు పీఎం కిసాన్ నిధులు జమ య్యాయి. నా మనవడు, మనవరాలికి తల్లికి వందనం కూడా అందింది.

- వెంకటరమణ, పీటీఎం ఎస్సీ కాలనీ

అన్నదాత కష్టాలు తీర్చేందుకే..



అన్నదాతల కష్టాలు తెలిసినందునే వారిని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నదాత సుఖీభవ పథకం తెచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం నిధులు మంజూరు చేయడం హర్షణీయం.

- గంటా మురళి, వెంకోజీగారిపల్లె, నిమ్మనపల్లె

అన్నదాతకు రెట్టింపు సంతోషం



రాష్ట్రంలోని దాదాపు 46 లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేయడం సంతోషంగా ఉంది. నిధులు కూడా వారి ఖాతాల్లో జమ అవుతున్నాయి. రైతులు ఆనందంగా ఉన్నారు. రైతుల తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు.

- కె.మునిరత్నం, నిమ్మనపల్లె


చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు



ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన మాటను చంద్రబాబు నిలబెట్టుకున్నారు. మా గ్రామంలో నాతో పాటు చాలా మందికి డబ్బులు పడ్డాయి. ఆ డబ్బులతో రైతులకు ఎంతో కొంత మేలు జరుగుతుంది.

- అబ్దుల్ రెహ్మాన్, ముడుపులవేముల, పీలేరు

అన్నదాతకు నిజమైన వరం



అన్నదాత సుఖీభవ పథకం రైతులకు వరం లాంటిది. గడిచిన నాలుగు నెలలుగా మామిడి, ఇతర పంటల్లో రైతులకు నష్టాలు వచ్చాయి. వేరుశనగ సీజన్ కోసం అప్పులు చేయాల్సి వచ్చింది. ఇప్పుడు గవర్నమెంటు వేసిన డబ్బులతో ఆ పంటను కాపాడుకోవచ్చు.

- శ్రీరాములు, ఎర్రగుంటపల్లె, పీలేరు మండలం

రైతులందరూ సంతోషంగా ఉన్నారు...



చంద్రబాబు చెప్పిన సమయానికి అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ నిధులు జమ కావడంతో మా ఊళ్లోని రైతులందరూ సంతోషంగా ఉన్నారు. ఆ డబ్బులు పెట్టుబడి ఖర్చులకు ఉపయోగపడతాయి. రైతులకు ఉపయోగపడేలా మరిన్ని పథకాలు తేవాలని మేము చంద్రబాబును కోరుతున్నాం.

- వి. వెంకటయ్య నాయుడు, బోటుమీదపల్లె

గండికోటకు బిరబిరా కృష్ణమ్మ

● ఇన్‌ఫ్లో 10,165 క్యూసెక్కులు



గండికోట ప్రాజెక్టులోకి వేగంగా వస్తున్న కృష్ణాజలాలు

కొండాపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టులోకి కృష్ణాజలాలు వేగంగా వస్తున్నాయి. దీంతో ప్రాజెక్టులో రోజురోజుకు నీటిమట్టం పెరుగుతూ వస్తోంది. ఆదివా రం ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో 10,165 క్యూసెక్కులు ఉన్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా గండికోట నుంచి మైలవరం జలాశయానికి 1500 క్యూసెక్కులు, సీబీఆర్‌కు 1,000 క్యూసెక్కులు, పైడిపాలెం రిజర్వాయర్‌కు 400 క్యూసెక్కులు, జీఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్‌కు 600 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టులో ప్రస్తుతం 10.98 టీఎంసీల నీరు నిల్వ ఉందని, కాగా గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు అని ఈఈ తెలిపారు. ఇదిలా ఉండగా జీఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్‌కు 600 క్యూసెక్కుల నీరు వదులుతున్న నేపథ్యంలో ఈఈ ఆదివారం మెయిన్ కెనాల్‌ను పరిశీలించారు. 600 క్యూసెక్కుల నీరు వదులుతున్నప్పటికీ కాలువలో ఇంకా గ్యాప్ ఉందని, ఎటువంటి ఇబ్బంది లేదని తెలిపారు.

సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

గుర్రంకొండ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సంతానలక్ష్మిగా పేరుగాంచిన రెడ్డెమ్మ కొండ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలో అమ్మవారికి ఉదయాన్నే అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. శ్రావణ మాసం కావడంతో అమ్మవారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. ఈ నేపథ్యంలో అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సంతానం లేని దంపతులు సంతానం కోసం ఆకుపసరును తాగి ఆలయంలో వరపడ్డారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చి మొక్కులను తీర్చుకున్నారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్యక్రమంలో ఈవో మంజుల, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పంపిణీలో రాష్ట్రంలోనే రెండోస్థానం

● ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్



చియ్యవరంలో వృద్ధురాలికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్, తదితరులు

రైల్వేకోడూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి పంపిణీలో రాష్ట్రంలోనే 2వ స్థానంలో రైల్వేకోడూరు నియోజకవర్గం నిలిచిందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ తెలిపారు. ఆదివారం రైల్వేకోడూరు మండలంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బాధితుల ఇళ్ల వద్దకు వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో మొదటి స్థానంలో ఉన్నారని, రైల్వేకోడూరు నియోజకవర్గం రెండో స్థానంలో ఉందని తెలిపారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో వచ్చిన చెక్కులను ఎప్పటికప్పుడు పంపిణీ చేస్తున్నామన్నారు. మండలంలోని శెట్టిగుంట గ్రామానికి చెందిన మంకు కామాక్షమ్మకు రూ.46,695, ఉప్పరపల్లెకు చెందిన లక్కిరెడ్డి గంగిరెడ్డికి రూ.81,089, చియ్యవరం గ్రామానికి చెందిన చిట్టేటి యశోదమ్మకు 1,47,287, ఎస్ఆర్ గిరిజన కాలనీకి చెందిన పెట్లూరు తులసమ్మకు 1,10,242, ఓబనపల్లెకు చెందిన కనుపర్తి సుబ్బమ్మకు రూ.54,613, కొత్తపల్లె గ్రామాలకు చెందిన చాపల రమణకు రూ.58,507, గందరు ఖాదరమ్మకు రూ.37,100 చెక్కులను వారివారి ఇళ్లకు వెళ్లి స్వయంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకురాలు ముక్కా వరలక్ష్మీ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మృత్యువులోనూ విడదీయని అనుబంధం

● పెద్దపాళ్యం వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు
● ముగ్గురు అన్నదమ్ముల దుర్మరణం
● స్నేహితుల దినోత్సవం రోజున తీవ్ర విషాదం
● కేక్ కట్ చేసేందుకు వెళ్తూ తిరిగిరాని లోకాలకు





సంఘటనా స్థలంలో పడి ఉన్న మృతదేహాలు



ఆర్టీసీ బస్సు

ములకలచెరువు/మదనపల్లె అర్బన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వరుసకు ముగ్గురు అన్నదమ్ములు...చిన్నాన్న...పెద్దనాన్న బిడ్డలు...స్నేహితుల దినోత్సవం కావడంతో కేక్ కట్ చేసేందుకు రావాలని ములకలచెరువులోని ఓ స్నేహితుడు ఫోన్ చేశాడు. ముగ్గురు కలిసి ద్విచక్రవాహనంలో ములకలచెరువుకు బయలుదేరారు...అంతలోనే ముగ్గురిని మృత్యువు కబళించింది. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో ద్విచక్రవాహనం, ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ముగ్గురు అన్నదమ్ములు దుర్మరణం చెందారు. ముంబాయి-చెన్నై జాతీయ రహదారిలోని పెద్దపాళ్యం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ప్రమాదం జరిగింది. పోలీసుల కథనం మేరకు...ములకలచెరువు మండలం వేపూరికోట పంచాయతీ కుటాగుళోళ్లపల్లెకు చెందిన కుటాగుళోళ్ల చంద్రప్ప కుమారుడు వెంకటేష్ (26) డిగ్రీ వరకు చదువుకున్నాడు, అలాగే వేమనారాయణ కుమారుడు తరుణ్ (24) ఐటీఐ పూర్తి చేశాడు. ఇద్దరు ఇంటి వద్దే ఉంటూ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నారు. ఓబులేసు కుమారుడు మనోజ్ (19) కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో బీటెక్ చదువుతున్నాడు. బెంగళూరు నుంచి మనోజ్ శనివారం ఇంటికి వచ్చాడు. స్నేహితుల దినోత్సవం కావడంతో వెంకటేష్ స్నేహితుడు కేక్ కట్ చేసేందుకు ములకలచెరువుకు పిలిచాడు. ఈ క్రమంలో వీరు ముంబాయి-చెన్నై జాతీయ రహదారిలోని పెద్దపాళ్యం ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలోకి రాగానే ద్విచక్రవాహం, ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో వెంకటేష్, మనోజ్‌లు సంఘటనా స్థలంలోనే దుర్మరణం చెందారు. తరుణ్‌ను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యంలో మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ నరసింహుడు పరిశీలించారు.



ఆస్పత్రిలో రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఎస్ఐ వాహనంలోనే ఆస్పత్రికి తరలింపు

ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న వెంటనే ఎస్ఐ నరసింహుడు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంకటేష్, మనోజ్‌లు చలనం లేకుండా పడి ఉండగా తరుణ్ కొనఊపిరిలో ఉండగా ఎస్ఐ ఆలస్యం చేయకుండా తన వాహనంలోనే ముగ్గురిని ఎక్కించి మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. 108కు సమాచారం ఇస్తే వచ్చేందుకు సమయం పడుతుందని ఎస్ఐ తన వాహనంలోనే ఆస్పత్రికి తీసుకెళ్లారు.

కుటాగుళోళ్లపల్లెలో తీవ్ర విషాదం

రోడ్డు ప్రమాదంలో ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు దుర్మరణం చెందడం...ముగ్గురు కూడా వరుసకు అన్నదమ్ములు కావడంతో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. ముగ్గురు యువకుల మృతదేహాలను చేసి కుటుంబీకులు గుండెలు పగిలేలా రోదించారు.

రైతు బాంధవుడు చంద్రబాబు

● సీమకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రత్యేక ప్రణాళికలు
● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి
● వెలిగల్లు నుంచి నీరు విడుదల



కుడి కాలువలో ప్రవహిస్తున్న నీరు



వెలిగల్లు నుంచి నీటిని విడుదల చేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

గాలివీడు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రైతాంగాన్ని ఆదుకోవడానికి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి వాటిని అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కొనియాడారు. ఆయన ఆదివారం జలవనరులశాఖ అధికారులతో కలిసి వెలిగల్లు ప్రాజెక్టు నుంచి కుడి కాలువకు నీటిని విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జలవనరులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారన్నారు. రాయలసీమ ప్రాంతంలో నెలకొన్న కరువు కాటకాలకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని అందులో భాగంగా ఈ ప్రాంతానికి నీటిని అందించే విధంగా గోదావరి నుంచి బనకచర్ల వరకు నీటిని తీసుకురావడానికి ప్రత్యేక ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. హంద్రీ-నీవా, గాలేరు- నగిరి కాలువల పెండింగ్ పనుల కోసం వాటి ఆధునీకరణ కోసం 3500 కోట్ల రూపాయలను కేటాయించారన్నారు. ఈ కాలువల నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతం సుభిక్షంగా మారుతుందని తెలిపారు. వెలిగల్లు ప్రాజెక్టు నుంచి కాలువలకు నీటిని విడుదల చేయడం ద్వారా ఈ ప్రాంత రైతాంగాన్ని ఆదుకుంటామని తెలిపారు. రోజుకు 60 క్యూసెక్కుల నీటిని కాలువలకు విడుదల చేయడం జరుగుతుందని ఇలా మూడు నెలల పాటు నీటి విడుదల కొనసాగుతుందని తెలిపారు. కాలువలకు నీటి విడుదలతో కాలువకు సమీపంలోని బావులు, బోరుబావులు, చెరువుల్లోకి నీరు చేరడంతో వివిధ రకాల పంటలను రైతులు సాగు చేసుకోవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఎస్ఈ అబుర్ షమీ, ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, డీఈఈలు భాస్కర్‌బాబు, శిరీశ్‌కుమార్, సురేశ్‌బాబు, రమణయ్య, సాంబ, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకయ్య, నియోజకవర్గ టీడీపీ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, మండల టీడీపీ నాయకుడు కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారుల కబంధ హస్తాల్లో

రంగసముద్రం చెరువు



రంగసముద్రం చెరువు

- ఆక్రమణలు తొలగించాలని కొందరు.. అడ్డుపడుతున్న మరికొందరు..
- అధ్వానంగా పంట కాల్వలు ● కూటమి నేతల ప్రయత్నాలు ఫలించేనా?

పోరుమామిళ్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పోరు మామిళ్ల మండలం సర్వే నెంబరు 226లోని 135.5 ఎకరాల్లో రంగసముద్రం చెరువు ఉండగా, సర్వే నెం.227లో 41.1 ఎకరాలు, సర్వే నెం.228లో 8.56 ఎకరాలు, సర్వే నెం.916లో 21.48 ఎకరాలు, సర్వే నెం.1194లో 5.88 ఎకరాల మేరకు లోతట్టు భూములున్నాయి. ఈ చెరువుకు నీరందించే కాలువల నిర్వహణను ఎవరూ పట్టించుకోకపోవ డంతో చెరువుకు నీరు అందడం ఆగిపోయింది. దీంతో అడవిని తలపించేలా చెరువులో కంప చెట్లు పెరిగిపోయాయి. దీనిని అదునుగా చేసు కుని కొందరు చెరువును ఆక్రమించేందుకు ప్ర యత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చెరువు కు హద్దులు చూపించాలంటూ ఇటీవల సాగు నీటి సంఘం ఛైర్మన్ తో కలసి కొందరు కూటమి నేతలు, ఆర్డీవో, కలెక్టరుకు విన్నవించారు. వారి ఆదేశాల మేరకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికా రులు సంయుక్తంగా సర్వే నిర్వహించి చెరువుకు హద్దులు నిర్ణయించడంతోపాటు ఆక్రమణలను నిర్ధారించారు.

> చెరువుల అభివృద్ధిని ప్రభుత్వం మరచిపోవడంతో వాటిలో ముళ్ల పొదలు పెరిగిపోయాయి. అజమాయిషీ లేకపోవడంతో పరపతి ఉన్నవారు చెరువు భూములను ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారు. మరికొందరు పట్టాలు సృష్టించి, వాటిని విక్రయించేందుకు కూడా ప్రయత్నించారు. అభ్యంతరాలు ఎదురుకావడంతో తాత్కాలికంగా తమ ప్రయత్నాలకు విరామం ప్రకటించారు.

ఆక్రమణదారుల్లో అధికార పార్టీ నేతలు..

చెరువుకు సంబంధించి సర్వే నెంబరు 226లోని 135 ఎకరాల్లో దాదాపు 35 ఎకరాలకు పైగా ఆక్రమణకు గురైందన్న ఆరోపణలు ఉన్నాయి. సర్వే నెంబరు 227లోని 21 ఎకరాలకు కొందరు పట్టాలు కూడా పొందారు. వీటిలో పార్కు ఎదు రుగా ఉన్న భూముల్లో తమకు పట్టాలున్నాయని, ఎన్నో ఏళ్లుగా వాటిని తాము సాగు చేసుకుంటున్నా మని అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూములను దక్కించుకునేందుకు కొందరు ప్రయత్నించగా, వాటిని విక్రయించేందకు కూడా కొందరు సిద్ధపడ్డారు. అయితే, ఇటీవల సర్వేలో నిర్ధారించిన ఆక్రమణలు తొలగించాలని టీడీపీకి చెందిన కొందరు పట్టుబడుతుండగా, ఆక్రమణ దారుల్లో ఇతరులతో పాటు అధికార పార్టీకి చెందిన వారు కూడా ఉండడంతో సమస్య జఠిలంగా మారింది. ఈ భూముల్లో పట్టాలు పొందిన వారికి అధికారులు నోటీసులు జారీ చేయగా ఆర్డీవో కోర్టులో విచారణ కూడా చేశారు. అయితే, రెవెన్యూ అధికారులు మంజూరు చేస్తేనే తమకు పట్టాలు అందాయని, తమ ఇంట్లో ఏమైనా రెవెన్యూ కార్యాలయం ఉందా, ఆన్‌లైన్, రెవెన్యూ రికార్డుల న్నీ రెవెన్యూ కార్యాయలంలోనే ఉంటాయి కదా , భూములు కేటాయిం చేటపుడు ఈ భూములు చెరువు లోతట్టు భూములని ఆ అధికారులకు తెలియదా అని కొందరు నేతలు ప్రశ్నించారు కూడా..



చెరువుకు నీరందించే కాలువలో పెరిగిన ముళ్లపొదలు

అభివృద్ధితోనే ఆక్రమణలకు చెక్..

చెరువుకు నీరందించే కాల్వలు కూడా ఆక్రమణలబారిన పడాయని, వీటిని పునరుద్ధరించి చెరువుకు నీరందిస్తే, ఈ ఆక్రమిత భూములన్నీ నీటిలో మునిగిపోతా యి కదా, ఆ మేరకు ఎందుకు చర్యలు తీ సుకోవడం లేదని కొందరు ప్రశ్నిస్తు న్నా రు. చెరువు ఎండి పో వడంతో ఖాళీగా ఉన్న భూములను మాత్రమే సాగు చేసుకుంటున్నారని, చెరువు నీటితో నిండితే ఆ అవ కాశం ఉండదని, కాల్వలను పునరుద్ధ రించి, పెరిగిపోయిన కంపచెట్లను తొలగించి చెరువులో పూర్తిస్థాయిలో నీరు నింపాలని పలువురు కోరుతున్నారు.

ఆక్రమణలు తొలగిస్తాం

రంగసముద్రం చెరువులో ఆక్రమణకు గురైన భూములను స్వాధీనం చేసుకుంటాం. అనుమతులు లేకుండా పొందిన విద్యుత్ కనెక్షన్లు తొలగించాలని ఇప్పటికే విద్యుత్ అధికారులకు నోటీసులు జారీ చేశాం. చెరువు లోతట్టు భూముల్లో అక్రమంగా పట్టాలు పొందిన ముగ్గురి పేర్లను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తొలగించాం. మిగిలిన సాంకేతిక సమస్యలను కలెక్టరు దృష్టికి తీసుకువెళ్లి ఆయన ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

-చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దారు, పోరుమామిళ్ల

రైతులు కూడా గ్రూపులు ఏర్పాటు చేయొచ్చు

- సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ దుర్గమ్మ



రైతులకు సూచనలిస్తున్న సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ దుర్గమ్మ

మదనపల్లె, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మహిళా స్వయం సహాయక సంఘాల తరహాలో రైతులూ గ్రూపులు ఏర్పాటు చేసుకోవచ్చని సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఏ.ప్రవీణ్‌కుమార్ సూచించారు. స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(సింగిల్‌విండో)లో ఆదివారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాల ఏర్పాటు ద్వారా రైతులు పంటల సాగు, పంట ఉత్పత్తులకు అయ్యే వ్యయాన్ని తగ్గించుకోవడంతో ఎక్కువ లాభాగాలకు విక్రయించుకునే అవకాశాన్ని వివరించారు. సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ దుర్గమ్మ మాట్లాడుతూ పీఎం.కిసాన్- అన్నదాత సుఖీభవలో డబ్బులు రాని రైతులు స్థానికంగా ఉన్న రైతు భరోసా కేంద్రాలు లేదా టోల్‌ఫ్రీ నంబర్ 155251ను సంప్రదించాలని సూచించారు. ఈకేవైసీ, ఎన్‌పీసీఐ, తదితర సాంకేతిక సమస్యలు ఉండే అవకాశముందని ఆమె తెలిపారు. సింగిల్‌విండో సీఈవో పి.కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ రెండేళ్లలోనే తాము రూ.11కోట్లు బంగారు రుణాలు ఇచ్చి రికార్డు సృష్టించినట్లు తెలిపారు. బ్యాంకు నుంచి త్వరలో మరిన్ని సేవలు, వ్యాపారులు అందుబాటులోకి తేనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈకార్యక్రమంలో అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి సి.రఘునాథరెడ్డి, రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

లైన్ సోయింగ్‌తో వరిలో అధిక దిగుబడి



లైన్ సోయింగ్ పద్ధతిలో వరి నాట్లు వేస్తున్న రైతులు

వాల్మీకిపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): లైన్ సోయింగ్ పద్ధతి పాటిస్తే వరిలో అధిక దిగుబడులు సాధించవచ్చునని క్రాప్ డైవర్ట్ బ్లాక్ కోఆర్డినేటర్ రాజా రెడ్డి తెలిపారు. ఆదివారం మం డలంలోని చింతపర్తి గ్రామ పంచాయతీలో ఉన్న ఎర్రగుంట్ల బావి గ్రామంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు పరివర్తన్ సౌజన్యంతో, వెంకటేశ్వర విత్తన కమిటీ, వాసన్ సంస్థ ఆధ్వర్యంలో అవ గాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన గిరీష్‌కుమార్‌రెడ్డికి చెందిన 50 సెంట్ల విస్తీర్ణంలో దేశవాళీ వరి నారును బీజాంమృతంతో శుద్ధి చేసి లైన్ సోయింగ్ పద్ధతిలో నాటించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పద్ధతిలో నాటిన వరి పైరుకుతెగుళ్ల సోకవని, గాలి, వెలుతురు బాగా అందడంతో ఏపుగా పెరిగి అధిక దిగుబడులు వస్తాయన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నంద్యాల బిషప్‌గా ముద్దనూరు సీఎస్ఐ చర్చి ఫాదర్



సంతోష్ ప్రసన్న

ముద్దనూరు/కలసపాడు ఆగస్టు3(ఆంధ్రజ్యోతి):ముద్దనూరు ఎస్‌పీజీ (సీఎస్ఐ) చర్చి ఫాదర్ సంతోష్ ప్రసన్నరావు బాబు నంద్యాల డయాసిస్ బిషప్‌గా ఎన్నికైనట్లు ఎస్‌పీజీ చర్చి యూత్ సంఘం వారు తెలిపారు నంద్యాల డయాసిస్ బిషప్ పదవికి 9మంది పోటీ పడగా నలుగురు ఎంపికయ్యారు. చివరగా చెన్నైలోని మాడ్రేటర్ రూబేను మార్క్ ఆ నలుగురిలో ఫాదర్ సంతోష్ ప్రసన్న రావు బాబు ను బిషప్‌గా ఎంపిక చేశారన్నారు. సంతోష్ తల్లిదండ్రులు ప్రభుత్వ ఉపాధ్యాయులు. మంగళవారం నంద్యాల కేథడ్రల్ చర్చిలో సంతోష్‌కు బిషప్ పట్టాభిషేకం జరగనున్నట్లు బంధువులు తెలిపారు. బిషప్‌గా సంతోష్ ఎంపిక కావడం పట్ల కలసపాడు చర్చి కమిటీ, బంధువులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అదృశ్యమైన మహిళ ఆత్మహత్య



నాగజ్యోతి మృతదేహం

దువ్వూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కనిపించకుండా పోయిన ఓ మహిళ మృతదేహం ఆదివారం కేసీ కాలువలో లభ్యమైంది. పోలీసుల కథనం మేరకు తన భార్య నాగజ్యోతి (27) కనిపిం చడం లేదంటూ దువ్వూరులోని ఇందిరమ్మ కాలనీకి చెందిన హరి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసీ కాలువ వద్ద ఆమె చున్నీ కనిపించడంతో ఆత్మహత్యకు పాల్పడిందేమోనన్న అనుమానం తో కేసీ కెనాల్ అధికారులతో మాట్లాడి కాలువలో ప్రవాహం తగ్గించారు. దీంతో ఆదివారం ఉదయం భీమునిపాడు స్లూయిస్ వద్ద ఆమె మృతదేహం తేలింది. మృతదేహాన్ని ప్రొద్దుటూరు ఆస్పత్రికి తరలించారు. ఆమె ఆత్మహత్యతో ఆమె ఇద్దరు కూతుళ్లు అయిదేళ్ల తన్విక, మూడేళ్ల నైనిక తల్లిప్రేమకు దూరమయ్యారు.

బుద్ధుడి విగ్రహం ధ్వంసంపై చర్యలు తీసుకోవాలి

- డీపీఐ నేత తిరుమావళవన్ ఆగ్రహం



మీడియాతో మాట్లాడుతున్న డీపీఐ నేత తిరుమావళవన్

చెన్నై, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లె సమీపంలో ఉన్న కొండపై బుద్ధుడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన శక్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డీపీఐ నేత తొల్ తిరుమావళవన్ డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం నగరంలోని పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుమారు 20 సంవత్సరాల నుంచి మదనపల్లెలో బుద్ధ పూర్ణిమ కార్యక్రమాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీపీఐ ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నారని, ఆయనను రాజకీయంగా ఎదుర్కొలేక కొంతమంది ఆ విగ్రహాన్ని ధ్వంసం చేశారని, ఆ సంఘటనను ఖండిస్తూ ఆందోళనకు దిగిన శివప్రసాద్‌పై కేసులు నమోదు చేయడం గర్హనీయమన్నారు. బుద్ధుని విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తులను అరెస్టు చేసి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ చర్యలను ఖండిస్తూ ఆగస్టు 23 న విజయవాడలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డీపీఐ పార్టీ నిర్వాహకులతో కలిసి ధర్నా చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. మీడియా సమావేశంలో పార్టీ నేతలు బాలసింగం, వన్నియరసు, పీటీఎం శివప్రసాద్, యూ.గణపతి తదితరులు పాల్గొన్నారు.

అతిగా మద్యం తాగి ఇద్దరు మృతి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి):వేరువేరు ప్రాంతాల్లో మద్యానికి బానిసలైన ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. మండలంలోని బసినికొండకు చెందిన లక్ష్మన్న కుమారుడు పవన్(40)కు పదేళ్ల క్రితం భారతితో వివాహం జరిగింది. పెళ్లైన ఏడాదికే ఆమె మృతి చెందగా, అప్పటి నుంచి మద్యానికి బానిసై పనులకు వెళ్లకుండా ఉండేవాడని, ఆదివారం బసినికొండ పెట్రోల్ బంకు సమీపంలో మద్యం అతిగా తాగి అక్కడే పడి చనిపోయాడు. గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పట్టణంలోని మార్చురి వీధికి చెందిన ఖాదర్ బాషా కుమారుడు షరీఫుద్దీన్ (38)మద్యానికి బానిసయ్యాడు. అతని భార్య హమీదా కూలి పనులు చేస్తుండగా, ఇతను చెడు తిరుగుళ్లు తిరుగుతూ ఉండేవాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం భార్య పనికి వెళ్లి వచ్చేసరికి భర్త అపస్మారక స్థితిలో కనిపించాడు. వెంటనే అతనిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని ఇంటికి తరలించారు

ఆసక్తికరంగా జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు



పరుగు పోటీలో పాల్గొన్న క్రీడాకారులు



హైజంప్ చేస్తున్న యువకుడు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలో అండర్-14, 16 జిల్లా స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు ఆసక్తికరంగా సాగాయి. బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆద్వర్యంలో మూడవ తేదీ ఉదయం జరిగిన పోటీలకు జిల్లా వ్యాప్తంగా 350 మంది క్రీడాకారులు హాజరయ్యారు. బాలబాలికలకు 60, 600 మీటర్ల రన్నింగ్, లాంగ్‌జంప్, జావెలిన్ త్రో, షాట్‌పుట్, హైజంప్, ట్రైయథ్లాన్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందినవారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. పోటీల్లో ప్రతిభ కనపరిచిన 30 మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారు ఈనెల 9, 10, 11 తేదీల్లో బాపట్లలో జరిగే ఏపీ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ కార్యదర్శి అహమర్‌బాష తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ సంచాలకులు నాగూర్‌బాష, శివారెడ్డి, శంకర్, నరేష్, ఎర్రన్న, చందు, నాగేశ్వరరావు, ఖాదర్‌రెడ్డి, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

విభిన్నప్రతిభావంతులకు పరికరాలు



దివ్యాంగుల అర్హత పత్రాలను పరిశీలిస్తున్న అధికారి అజయ్

కడప కలెక్టరేట్, ఆగస్టు 3,(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం దివ్యాంగులకు, విభిన్న ప్రతిభావంతులకు పరికరాలు పంపిణీ చేస్తోందని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలనీ అధికారి అజయ్ సూచించారు. ఆదివారం శంకరాపురంలోని అంధుల పాఠశాలలో జేకే వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పఠాన్ ఖాదర్ బాషాతో కలసి దివ్యాంగుల దరఖాస్తులను పరిశీలించి, ఆన్లైన్‌లో అప్‌లోడ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వం సౌజన్యంతో కాన్పూర్‌కు చెందిన కృతిమ అవయవాల తయారీ సంస్థ, విభిన్న ప్రతిభావంతులు, వృద్ధుల సంక్షేమ శాఖల సంయుక్తంగా చేతి కర్రలు, మూడు కాళ్ల చేతికర్రలు, వాకర్లు, నాలుగు కాళ్ల చేతి కర్రలు, చంక కర్రలు, వీల్ చైర్లు, ట్రైసైకిళ్లు, బ్యాటరీ ట్రైసైకిళ్లు. వినికిడి పరికరాలతో పాటు రోలేటర్లు, ఎమ్మెస్ కిట్లు, అంధులకు వాచీలు, వాయిస్ ఫోన్లు తదితర పరికరాలను అందజేస్తారన్నారు.

యువకుడిపై కత్తితో దాడి

- పరారీలో నలుగురు యువకులు



రిమ్స్‌లో చికిత్స పొందుతున్న చాన్‌బాషా

కడప క్రైం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి):కడప నగరం మురాదియా నగర్‌కు చెందిన షేక్ చాన్‌బాషాను కత్తితో పొడిచి గాయ పరిచినట్లు తాలూకా పోలీసులు తెలిపారు. బాధితుడి కుటుంబ సభ్యుల కథనం మేరకు చాన్‌బాషా వంట పనులు చేయడంతోపాటు సాయంత్రం పూట జీవాలు మేపుతుంటాడు. ఆది వారం సాయంత్రం జీవాలు మేపే సమయంలో గుర్రాల గడ్డ ప్రాంతం నుంచి వచ్చిన నలుగురు యువకులు చాన్‌బాషాతో గొడవకు దిగారు. ఆపై వారి వద్ద ఉన్న కత్తితో మూడు చోట్ల పొడిచి అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న తెలిపారు.

టీడీపీ నాయకుడిపై వైసీపీ వర్గీయుల దాడి



దాడిలో గాయపడిన చుక్కా కొండయ్య తదితరులు

నందలూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రేషన్ షాపును అందరికీ అనుకూలమైన ప్రదేశానికి మార్చాలని డిమాండ్ చేసినందుకు టీడీపీ నాయకుడు చుక్కా కొండయ్య, మరికొంతమందిపై వైసీపీ నాయకులు దాడి చేశారు. ఈ సంఘటన చింతకాయల పల్లెలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు... చింతకాయలపల్లెకు చెందిన రేషన్ షాపు కుందానెల్లూరులో ఉంది. ఆ గ్రామంలో 50 రేషన్ కార్డులు మాత్రమే ఉన్నాయి. చింతకాయలపల్లె, మదనమోహనపురం, కొత్తచాపల వారిపల్లె గ్రామాలకు చెందిన సుమారు 600 మంది రేషన్‌కార్డుదారులు కుందా నెల్లూరుకు వెళ్లి రేషన్ తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రేషన్ షాపును చింతకాయలపల్లెలో ఏర్పాటు చేస్తే అందరికీ అందుబాటులో ఉంటుందని టీడీపీ నేత చుక్కా కొండయ్య సంబంధిత అధికారులకు విన్నవించారు. ఈ విషయం తెలిసిన చింతకాయలపల్లెకు చెందిన వైసీపీ నాయకుడు గంగినాయుడు ఆయన బంధువులు సుమారు 20 మంది చుక్కా కొండయ్య, అతని బంధువులపై దాడికి పాల్పడ్డారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసుల ఎదుట కూడా తమపై దాడి చేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

నాడు ఊరికే తలమానికం..

నేడు శిథిల గృహం!

- ములకలచెరువులో మొట్టమొదటి కట్టడం



ములకలచెరువు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): బ్రిటిష దొరలు మార్గమధ్యంలో సేదతీరేందుకు 120 ఏళ్ల క్రితం నిర్మించుకున్న కట్టడం కారణంగానే ములకలచెరువు గ్రామం ఏర్పడింది. చాలా కాలం వరకూ ఒక వెలుగు వెలిగిన ఈ భవనం పట్టించుకునేవారు లేక ప్రస్తుతం శిథిల గృహంగా దర్శనమిస్తోంది.

ములకలచెరువులోని బస్టాండు సర్కిల్ సమీపంలోని ముంబై - చెన్నై జాతీయ రహదారి పక్కన ప్రస్తుతం ఓ పాడుబడిన ఓ బంగ్లా కనిపిస్తుంది. ఇక్కడ ఊరే లేని సమయంలో ఈ మార్గంలో రాకపోకలు సాగించే తెల్లదొరలు తాము విశ్రాంతి తీసుకునేందుకు ఇక్కడ బంగ్లాను నిర్మించారు. కాలక్రమంలో ఇక్కడ రైల్వేస్టేషన్ నిర్మించడంతో ఊరు ఏర్పడింది. బ్రిటిష దొరల తరువాత ఈ మార్గంతో వెళ్లే మంత్రులు, ముఖ్య నాయకులు, ఉన్నతాధికారులు ఇక్కడే విశ్రాంతి తీసుకునేవారు. ప్రస్తుతం నిర్వహణ లేకపోవడంతో బంగ్లా రూపు రేఖలే మారిపోయాయి. పాలకులెవరూ పట్టించుకోక పోవడంతో ఎందుకూ పనికిరాకుండా పోయింది. బంగ్లా గోడలు కూలిపోతున్నాయి. బంగ్లా ఆవరణ చెత్తాచెదారంతో నిండిపోయింది. పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో అక్కడ బంగ్లా ఉన్న ఆనవాళ్లు కూడా కనిపించడం లేదు. బంగ్లా ముందు దుకాణాలు ఏర్పడడంతో కనుమరుగైంది. ఉన్నతాధికారులు స్పందించి ఈ బంగ్లాను పునరుద్ధరించడమో, దీన్ని తొలగించి కొత్త భవనాలు నిర్మిస్తే ఏదైనా ప్రభుత్వ కార్యాలయానికి వినియోగించుకోవచ్చని స్థానికులు చెబుతున్నారు.



మురుగు పారే దారేదీ..?

రాజంపేట టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మున్సిపాలిటీలో ఎంతో కాలంగా మురుగు నీరు నిల్వ ఉండటంతో ఆ ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో దోమల బెడదతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో సాయంత్రం ఆరు గంటల నుంచి కాసేపు ఎక్కడ నిలబడినా దోమలు మూకుమ్మడిగా దాడిచేస్తున్నాయని, దీంతో విషజ్వరాలబారిన పడుతున్నామని పేర్కొన్నారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం ప్రధాన కారణం కాగా ఖాళీ స్థలాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త పేరుకుపోవడం కూడా మరో కారణమవుతోంది. దీనికితోడు ప్రధాన కాలువలపైన మూతలు లేకపోవడం, వాటిలో ప్రజలు చెత్త వేయడంతో నీరు ప్రవహించడం లేదు. ఇలా కాలువలు దోమలకు ఆవాసాలుగా మారి వృద్ధి చెంది విపరీతంగా పెరిగిపోయాయి. మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారు. ఈ దుస్థితిని అధికారులు, రాజకీయ నాయకులు చూస్తున్నారే తప్ప చర్యలు చేపట్టాలన్న ఆలోచన లేకపోవడం బాధాకరం. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.


కాలువలో నిల్వ ఉన్న మురుగునీరు

దోమల నివారణకు చర్యలు చేపట్టండి సారూ...



పట్టణంలో ముగురు కాలువల పరిస్థితి దయనీయంగా మారింది. మురుగు నీరు ప్రవహించదు. కాలువల్లో చెత్త నిండిపోయి ఉంటుంది. మామూలుగా నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో దోమలు, లార్వాలు చనిపోయేందుకు ప్రతివారం అబిట్, మలాథియన్ రసాయనాలు చేయాలి. లార్వాను తినే గంబూషియా చేపలు మురికి కాలువల్లో వదలాల్సి ఉంది. రానున్నది వర్షాకాలం కాబట్టి ముందుగానే నివారణ చర్యలు చేపట్టి ప్రజా ఆరోగ్యంపైన దృష్టి సారించాలి.
- సికిందర్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి, రాజంపేట

ఆర్థిక వనరులు ఉన్నా అభివృద్ధి శూన్యం



పట్టణంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే కీటకాలు, దోమలు దరిచేరవు. రాజంపేటలో పరిస్థితి అలా లేదు. మున్సిపాలిటీలో ఆర్థిక వనరులు సమృద్ధిగా ఉన్నప్పటికీ వాటిని ఖర్చు చేయడంలో నేతలు, అధికారుల మధ్య సమన్వయం లేకపోవడమే దీనికి ప్రధాన కారణం. ప్రతి కౌన్సెలింగ్ సమావేశంలో రాతపూర్వకంగా అజెండా ఉన్నప్పటికీ అమలు చేయడం మాత్రం శూన్యం. ఇప్పటికైనా నేతలు, అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.
- అబూబకర్, టీడీపీ మైనార్టీ నేత, రాజంపేట

అండర్ డ్రైనేజీ ఏర్పాటు చేయాలి



రాజంపేట పట్టణంలో పెరిగిన జనాభాకు అనుగుణంగా అండర్ డ్రైనేజీ ఏర్పాటు చేసినప్పుడే ఈ సమస్యకు పరిష్కారం దొకుతుంది. కాలువలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో మురుగునీరు సరిగా ప్రవహించడంలేదు. చినుకుపడితే చాలు రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తోంది. ఓపెన్ డ్రైనేజీ కావడంతో దోమలు విపరీతంగా తయారవుతున్నాయి. వీటన్నింటికీ పరిష్కారం అండర్ డ్రైనేజీ అని నా అభిప్రాయం.
- నాగేశ్వరచౌదరి, ప్రముఖ న్యాయవాది, రాజంపేట



చెత్తాచెదారం, మట్టితో నిండిన మురుగు కాలువలు


పోయే దారి లేక నిల్వ చేరిన వర్షపు నీరు

పలువురు నాయకులతో జగన్‌మోహన్‌రాజు సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

ఒంటిమిట్ట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులతో రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్‌రాజు సమావేశమయ్యారు. ఆదివారం టీడీపీ మహిళా కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి ఓబినేని సుబ్బమ్మతో సమావేశమయ్యారు. అనంతరం టీడీపీ మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ జిలానిబాషాతో సమావేశమయ్యారు. అలాగే పలువురు నాయకులతో కలిశారు. అందరినీ ఏకతాటిపైకి తెచ్చే ప్రయత్నం చేశారు. అందరం కలిసికట్టుగా పనిచేసి జడ్పీటీసీ ఎన్నికల్లో విజయం సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు నల్గొండ వెంకటసుబ్బారెడ్డి, శివారెడ్డి, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి కీలకం : టీడీపీ

గాలివీడు, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తలు పార్టీకి పట్టుకొమ్మలాంటి వారని డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన గాలివీడులోని చేపల కాలనీలో పర్యటించారు. ఎగువగొట్టివీడుకు చెందిన విజయ్‌కుమార్‌నాయుడు అనారోగ్య సమస్యతో బాధపడుతున్న విషయాన్ని గమనించి ఆయనకు మెరుగైన చికిత్సకు రూ.నాలుగు లక్షలు ప్రకటించి అందుకు సంబంధించిన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలివీడు మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో సిమెంటు రోడ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. అవసరమైన గ్రామాల్లో తాగునీటి కోసం బోర్లను వేయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ అన్నమయ్య జిల్లా 2వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు పిలుపునిచ్చారు. ఆదివారం లక్కిరెడ్డిపల్లె పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆగస్టు 11, 12వ తేదీల్లో మదనపల్లిలో జరిగే జిల్లా మహాసభలకు కార్మికులు, కర్షకులు పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులు పాల్గొని జయప్రదం చే యాలని పిలుపునిచ్చారు. అన్నమయ్య జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం రూ. పదివేల కోట్లు కేటాయించేంతవరకు పోరాడాలని పిలుపునిచ్చారు. సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల మాట్లాడుతూ కడప-బెంగుళూరు రైల్వేలైన్ దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రాయచోటి, పీలేరు, మదనపల్లె ప్రాంతాలు రైలు మార్గం ఏర్పాటుకు చొరవ చూపారని, కానీ జగన్ ప్రభుత్వంలో నిధులు లేవని పాత అలైన్మెంటును మార్చి ముదిగుబ్బ మీదుగా బెంగళూరుకు మార్చారన్నారు. ఈ మూడు ప్రాంతాల అభివృద్ధికి పాత అలైన్మెంట్ పద్ధతిలోనే ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మర్రిసుమిత్ర పాల్గొన్నారు.

ఖాళీ సీట్లకు దరఖాస్తు చేసుకోండి

సంబేపల్లె, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎర్రగుంట్ల సమీపంలో గల రాయచోటి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్లకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ వీవీ సునీత ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలలో 5వ తరగతిలో ఎస్సీ 30 సీట్లు, ఓసీ 1, 9వ తరగతిలో ఎస్సీ రెండు ఓసీ 1, 10వ తరగతిలో ఎస్సీ 2, ఎస్టీ 1, జూనియర్ ఎంపీసీ ఎస్సీ 12 జూనియర్ బైపీసీ బీసీ 1, సీనియర్ ఎంపీసీ ఎస్సీ 10 ఓసీ ఒకటి సీనియర్ బైపీసీ ఎస్సీ 4 ఓసీ 1, బీసీ 1 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఆధార్, టీసీ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో వచ్చి స్పాట్ అడ్మిషన్లు పొందవచ్చునని వివరించారు. గురుకుల విద్యాలయ సొసైటీ విధానాల మేరకు సీట్లు భర్తీ చేయడం జరుగుతుందని విద్యార్థులు అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడదాం

● సీఐటీయూ జిల్లా స్థాయి సమావేశంలో ఏవీ నాగేశ్వరరావు


మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు

రాయచోటిటౌన్, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి):కార్మికులకు నష్టం కలిగించే విధంగా బీజేపీ అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడతామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరావు పేర్కొన్నారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో సీఐటీయూ జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ బీజేపీ అమలు చేయాలని చూస్తున్న లేబర్ కోడ్లను వ్యతిరేకిస్తూ జూలై 9న అన్నమయ్య జిల్లాలో జరిగిన సమ్మెలో పాల్గొన్న కార్మిక ఉద్యోగులను ఆయన అభినందించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు, జిల్లా కార్యదర్శి భాగ్యలక్ష్మి, శ్రీలక్ష్మి, వెంకట్రామయ్య, మెహరున్నీషా, రవికుమార్, ఓబులమ్మ, సురేంద్ర, రెడ్డెప్ప, పెద్ద ఎత్తున స్కీం వర్కర్స్ మున్సిపల్ పంచాయతీ, విద్యుత్, వీవోఏ, 104, 108 కార్మికులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

● ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ రాజశేఖర్

సిద్దవటం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తప్పవని ప్రొబిషన్ ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ హెచ్చరించారు. ఆదివారం ఆయన సిద్దవటంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ బెల్ట్ షాపుల నిర్వహణ, గంజాయి, మత్తు పదార్థాలు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ పోలీసులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను తీర్చిన మంత్రి మండిపల్లి


బోరును ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణ పరిధిలోని ఎగువ అబ్బవరం గ్రామం కొత్తపల్లిలో గత కొన్ని సంవత్సరాలుగా తాగునీటి సమస్యతో గ్రామస్థులు ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదివారం బోరు వేయించి, మోటారు బిగించి మీటర్ నొక్కి తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

చిన్నమండెం, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలను సద్వినియో గం చేసుకోవాలని రా ష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మం డిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆది వారం తన స్వగ్రామం బోరెడ్డిగారిపల్లెలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అధికారులకు ఫోన్ చేసి సకాలంలో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

పెన్నా నదిపై పోలీసు భద్రత


సిద్దవటం పెన్నానది వంతెన వద్ద కాపలాగా ఉన్న పోలీసులు

సిద్దవటం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : పెన్నానదిలో నీటిమట్టం రెట్టింపు సందర్భంగా ప్రమాదాలు జరగకుండా ఎస్ఐ మహమ్మద్‌రఫి ఆధ్వర్యంలో ఆదివారం పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ సుబ్బరామచంద్ర మాట్లాడుతూ లోకాజ్‌వే వద్ద ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన ఏర్పాటు చర్యలు తీసుకున్నామని, జాలర్లు పెన్నానదిలోకి దిగవద్దని, నదీతీర ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

యల్లమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు

సిద్దవటం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాచుపల్లి గ్రామంలో వెలసిన రేణుకా యల్లమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి నరసింహరాజు మాట్లాడుతూ అమ్మవారికి రామనపల్లి గ్రామానికి చెందిన నాగిరెడ్డి కుటుంబ సభ్యులు పట్టు వస్త్రాలు సమర్పించారన్నారు. అమ్మవారికి కుంకుమార్చన, వివిధ పూల అలంకరణ వంటి ప్రత్యేక పూజలు నిర్వహించి వచ్చిన భక్తులకు ప్రసాదాలు అందజేశామన్నారు.


పూజలందుకున్న రేణుకా యల్లమ్మ

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పెండ్లిమర్రి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎగువపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1996-2001 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. 24 ఏళ్ల తర్వాత ఒక్కచోట కలుసుకుని ఒకరికొకరి యోగక్షేమాలను తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను, చదివిన బడి పరిసరాలను, చదువు చెప్పిన ఉపాధ్యాయులను చూసి భావోద్వేగానికి గురయ్యారు. తమ తోటి విద్యార్థి మరణంతో ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేదని తెలుసుకుని అతని సతీమణికి రూ.20 వేలు అందజేశారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు.

నైతిక విలువలతో కూడినది మానవతా సంస్థ


మాట్లాడుతున్న మానవత సంస్థ మండల అధ్యక్షుడు ఉమాపతిరెడ్డి

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ నైతిక విలువలతో కూడినదని ఆ సంస్థ కేంద్ర కమిటీ సభ్యుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్‌యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక నలంద స్కూల్‌లో మానవతా సేవా సంస్థ నూతన కమిటీని ఎంపిక చేశారు. మండల అధ్యక్షుడిగా మాజీ ఎంపీపీ ఉమాపతిరెడ్డి, కార్యదర్శిగా వీరనాగిరెడ్డి, కోశాధికారిగా రవిశంకర్, ఉపాధ్యక్షుడిగా పక్కీరయ్య, పది మంది సభ్యులు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్ ఎండీ షరీఫ్‌నాయక్, రవిశంకర్‌రెడ్డి, శివయ్య, సంస్థ చైర్మన్ బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

నల్లగంగమ్మకు పూజలు



సంబేపల్లె, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): దేవరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు చేశారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ అర్చకులు, అధికారులు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

సిద్దవటం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం గ్రామ శివారులోని జగనన్న గ్రామ సమీపాన పేకాట ఆడుతున్న ఆరుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ మహ్మద్ రఫి తెలిపారు. వారి వద్ద ఉన్న రూ. 13210 నగదును స్వాధీనం చేసుకు న్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి: ఎస్ఎఫ్ఐ



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రైల్వేకోడూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల యాజమాన్య కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రుల మినహా ఎవరినీ పాఠశాలల్లోకి అనుమతించరాదని విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు లతీఫ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ హైస్కూలు ఆవరణంలో ధర్నా నిర్వహించారు.

నిత్యపూజస్వామి ఆలయంలో వేలం పాట

సిద్దవటం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం మండలం వంతాటిపల్లె గ్రామం లంకమల్ల అడవుల్లో వెలసిన నిత్యపూజ స్వామి ఆలయానికి సంబంధించి విడి రోజుల్లో 01.09.2025 నుంచి 31.08.2026 వరకు భక్తులు సమర్పించే తలనీలాలు, తాత్కాలిక దుకాణం నిర్వహణకు సంబంధించి ఈనెల 5న ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి శ్రీధర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనేవారు తలనీలాలకు రూ.లక్ష, తాత్కాలిక షాపు నిర్వహణకు రూ.25 వేలు డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొనాలన్నారు. పాట ముగిసిన వెంటనే హెచ్చు పాటదారులు పూర్తి మొత్తం చెల్లించాలన్నారు.

ఉత్తమ సేవలతోనే ప్రజల్లో గుర్తింపు


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

రాయచోటిటౌన్, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించినప్పుడే వారికి ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని బోస్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్ ఇలియాస్ అన్నారు. పాఠశాలలోని పని చేస్తూ ఇటీవల జరిగిన బదీల్లో ఇతర పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. సన్మాన కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఇలియాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసినప్పుడు ఉపాధ్యాయ జీవితానికి పరిపూర్ణత లభిస్తుందన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులు సుబ్బరామరాజు, మహబూబ్‌జాన్, ముస్తాక్‌అహ్మద్, హఫీజుల్లాలను శాలువాలు, పూలమాలలతో జ్ఞాపికలను ఇచ్చి ఘనంగా సత్కరించారు.

రాష్ట్ర మంత్రిని కలిసిన మండల నాయకులు

ఒంటిమిట్ట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని టీడీపీ మండల నాయకులు కలిశారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని ఆయన కార్యాలయంలో కలిసి ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య, పార్టీ సీనియర్ నాయకుడు బొడ్డే వెంకటరమణ, మామిళ్ల ఈశ్వరయ్య, రేవిళ్ల బాలమునెయ్య, కట్టా సుబ్బరాయుడు, వినోద్‌రెడ్డి, బాలక్రిష్ణ, దిలీప్, ప్రతాప్‌రెడ్డి, మల్లేశ్‌యాదవ్, శంకర్‌దాదా పాల్గొన్నారు.

కబ్జాదారుల కబంధ హస్తాల్లో
రంగసముద్రం చెరువు


రంగసముద్రం చెరువు

● ఆక్రమణలు తొలగించాలని కొందరు.. అడ్డుపడుతున్న మరికొందరు..
● అధ్వానంగా పంట కాల్వలు ● కూటమి నేతల ప్రయత్నాలు ఫలించేనా?

పోరుమామిళ్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పోరు మామిళ్ల మండలం సర్వే నెంబరు 226లోని 135.5 ఎకరాల్లో రంగసముద్రం చెరువు ఉండగా, సర్వే నెం.227లో 41.1 ఎకరాలు, సర్వే నెం.228లో 8.56 ఎకరాలు, సర్వే నెం.916లో 21.48 ఎకరాలు, సర్వే నెం.1194లో 5.88 ఎకరాల మేరకు లోతట్టు భూములున్నాయి. ఈ చెరువుకు నీరందించే కాలువల నిర్వహణను ఎవరూ పట్టించుకోకపోవ డంతో చెరువుకు నీరు అందడం ఆగిపోయింది. దీంతో అడవిని తలపించేలా చెరువులో కంప చెట్లు పెరిగిపోయాయి. దీనిని అదునుగా చేసు కుని కొందరు చెరువును ఆక్రమించేందుకు ప్ర యత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చెరువుకు హద్దులు చూపించాలంటూ ఇటీవల సాగు నీటి సంఘం చైర్మన్ తో కలసి కొందరు కూటమి నేతలు, ఆర్డీవో, కలెక్టరుకు విన్నవించారు. వారి ఆదేశాల మేరకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికా రులు సంయుక్తంగా సర్వే నిర్వహించి చెరువుకు హద్దులు నిర్ణయించడంతోపాటు ఆక్రమణలను నిర్ధారించారు.

> చెరువుల అభివృద్ధిని ప్రభుత్వం మరచిపోవడంతో వాటిలో ముళ్ల పొదలు పెరిగిపోయాయి. అజమాయిషీ లేకపోవడంతో పరపతి ఉన్నవారు చెరువు భూములను ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారు. మరికొందరు పట్టాలు సృష్టించి, వాటిని విక్రయించేందుకు కూడా ప్రయత్నించారు. అభ్యంతరాలు ఎదురుకావడంతో తాత్కాలికంగా తమ ప్రయత్నాలకు విరామం ప్రకటించారు.

ఆక్రమణదారుల్లో అధికార పార్టీ నేతలు..

చెరువుకు సంబంధించి సర్వే నెంబరు 226లోని 135 ఎకరాల్లో దాదాపు 35 ఎకరాలకు పైగా ఆక్రమణకు గురైందన్న ఆరోపణలు ఉన్నాయి. సర్వే నెంబరు 227లోని 21 ఎకరాలకు కొందరు పట్టాలు కూడా పొందారు. వీటిలో పార్కు ఎదు రుగా ఉన్న భూముల్లో తమకు పట్టాలున్నాయని, ఎన్నో ఏళ్లుగా వాటిని తాము సాగు చేసుకుంటున్నా మని అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూములను దక్కించుకునేందుకు కొందరు ప్రయత్నించగా, వాటిని విక్రయించేందకు కూడా కొందరు సిద్ధపడ్డారు. అయితే, ఇటీవల సర్వేలో నిర్ధారించిన ఆక్రమణలు తొలగించాలని టీడీపీకి చెందిన కొందరు పట్టుబడుతుండగా, ఆక్రమణ దారుల్లో ఇతరులతో పాటు అధికార పార్టీకి చెందిన వారు కూడా ఉండడంతో సమస్య జఠిలంగా మారింది. ఈ భూముల్లో పట్టాలు పొందిన వారికి అధికారులు నోటీసులు జారీ చేయగా ఆర్డీవో కోర్టులో విచారణ కూడా చేశారు. అయితే, రెవెన్యూ అధికారులు మంజూరు చేస్తేనే తమకు పట్టాలు అందాయని, తమ ఇంట్లో ఏమైనా రెవెన్యూ కార్యాలయం ఉందా, ఆన్‌లైన్, రెవెన్యూ రికార్డుల న్నీ రెవెన్యూ కార్యాయలంలోనే ఉంటాయి కదా , భూములు కేటాయిం చేటపుడు ఈ భూములు చెరువు లోతట్టు భూములని ఆ అధికారులకు తెలియదా అని కొందరు నేతలు ప్రశ్నించారు కూడా..

అభివృద్ధితోనే ఆక్రమణలకు చెక్..

చెరువుకు నీరందించే కాల్వలు కూడా ఆక్రమణలబారిన పడాయని, వీటిని పునరుద్ధరించి చెరువుకు నీరందిస్తే, ఈ ఆక్రమిత భూములన్నీ నీటిలో మునిగిపోతా యి కదా, ఆ మేరకు ఎందుకు చర్యలు తీ సుకోవడం లేదని కొందరు ప్రశ్నిస్తున్నా రు. చెరువు ఎండి పో వడంతో ఖాళీగా ఉన్న భూములను మాత్రమే సాగు చేసుకుంటున్నారని, చెరువు నీటితో నిండితే ఆ అవ కాశం ఉండదని, కాల్వలను పునరుద్ధ రించి, పెరిగిపోయిన కంపచెట్లను తొలగించి చెరువులో పూర్తిస్థాయిలో నీరు నింపాలని పలువురు కోరుతున్నారు.


చెరువుకు నీరందించే కాలువలో పెరిగిన ముళ్లపొదలు

> **ఆక్రమణలు తొలగిస్తాం**
> రంగసముద్రం చెరువులో ఆక్రమణకు గురైన భూములను స్వాధీనం చేసుకుంటాం. అనుమతులు లేకండా పొందిన విద్యుత్ కనెక్షన్లు తొలగించాలని ఇప్పటికే విద్యుత్ అధికారులకు నోటీసులు జారీ చేశాం. చెరువు లోతట్టు భూముల్లో అక్రమంగా పట్టాలు పొందిన ముగ్గురి పేర్లను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తొలగించాం. మిగిలిన సాంకేతిక సమస్యలను కలెక్టరు దృష్టికి తీసుకువెళ్లి ఆయన ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.
> -చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దారు, పోరుమామిళ్ల

రైతులు కూడా గ్రూపులు ఏర్పాటు చేయొచ్చు
● సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ దుర్గమ్మ


రైతులకు సూచనలిస్తున్న సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ దుర్గమ్మ

మదనపల్లె, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మహిళా స్వయం సహాయక సంఘాల తరహాలో రైతులూ గ్రూపులు ఏర్పాటు చేసుకోవచ్చని సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఏ.ప్రవీణ్‌కుమార్ సూచించారు. స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(సింగిల్‌విండో)లో ఆదివారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాల ఏర్పాటు ద్వారా రైతులు పంటల సాగు, పంట ఉత్పత్తులకు అయ్యే వ్యయాన్ని తగ్గించుకోవడంతో ఎక్కువ లాభాగాలకు విక్రయించుకునే అవకాశాన్ని వివరించారు. సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ దుర్గమ్మ మాట్లాడుతూ పీఎం.కిసాన్- అన్నదాత సుఖీభవలో డబ్బులు రాని రైతులు స్థానికంగా ఉన్న రైతు భరోసా కేంద్రాలు లేదా టోల్‌ఫ్రీ నంబర్ 155251ను సంప్రదించాలని సూచించారు. ఈకేవైసీ, ఎన్‌పీసీఐ, తదితర సాంకేతిక సమస్యలు ఉండే అవకాశముందని ఆమె తెలిపారు. సింగిల్‌విండో సీఈవో పి.కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ రెండేళ్లలోనే తాము రూ.11కోట్లు బంగారు రుణాలు ఇచ్చి రికార్డు సృష్టించినట్లు తెలిపారు. బ్యాంకు నుంచి త్వరలో మరిన్ని సేవలు, వ్యాపారులు అందుబాటులోకి తేనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈకార్యక్రమంలో అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి సి.రఘునాథరెడ్డి, రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

లైన్ సోయింగ్‌తో వరిలో అధిక దిగుబడి


లైన్ సోయింగ్ పద్ధతిలో వరి నాట్లు వేస్తున్న రైతులు

వాల్మీకిపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): లైన్ సోయింగ్ పద్ధతి పాటిస్తే వరిలో అధిక దిగుబడులు సాధించవచ్చునని క్రాప్ డైవర్ట్ బ్లాక్ కోఆర్డినేటర్ రాజా రెడ్డి తెలిపారు. ఆదివారం మం డలంలోని చింతపర్తి గ్రామ పంచాయతీలో ఉన్న ఎర్రగుంట్ల బావి గ్రామంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు పరివర్తన్ సౌజన్యంతో, వెంకటేశ్వర విత్తన కమిటీ, వాసన్ సంస్థ ఆధ్వర్యంలో అవ గాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన గిరీష్‌కుమార్‌రెడ్డికి చెందిన 50 సెంట్ల విస్తీర్ణంలో దేశవాళీ వరి నారును భీజాంమృతంతో శుద్ధి చేసి లైన్ సోయింగ్ పద్ధతిలో నాటించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పద్ధతిలో నాటిన వరి పైరుకుతెగుళ్లు సోకవని, గాలి, వెలుతురు బాగా అందడంతో ఏపుగా పెరిగి అధిక దిగుబడులు వస్తాయన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నంద్యాల బిషప్‌గా ముద్దనూరు సీఎస్ఐ చర్చి ఫాదర్


సంతోష్ ప్రసన్న

ముద్దనూరు/కలసపాడు ఆగస్టు3(ఆంధ్రజ్యోతి):ముద్దనూరు ఎస్‌పీజీ (సీఎస్ఐ) చర్చి ఫాదర్ సంతోష్ ప్రసన్నరావు బాబు నంద్యాల డయాసిస్ బిషప్‌గా ఎన్నికైనట్లు ఎస్‌పీజీ చర్చి యూత్ సంఘం వారు తెలిపారు నంద్యాల డయాసిస్ బిషప్ పదవికి 9మంది పోటీ పడగా నలుగురు ఎంపికయ్యారు. చివరగా చెన్నైలోని మాడ్రేటర్ రూబేను మార్క్ ఆ నలుగురిలో ఫాదర్ సంతోష్ ప్రసన్న రావు బాబు ను బిషప్‌గా ఎంపిక చేశారన్నారు.

రేపు మూడు సింగిల్ విండోల్లో ప్రమాణ స్వీకారోత్సవాలు

కలికిరి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని మూడు సింగిల్ విండో (సహకార సొసైటీ)ల్లో త్రీమెన్ కమిటీ పాలకవర్గాలు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టనున్నాయి. ఇప్పటికే కేవీ పల్లె, గుర్రంకొండ, వాల్మీకిపురం సొసైటీల్లో నూతన పాలకవర్గాల సభ్యులు ప్రమాణ స్వీకారాలు పూర్తి చేసి బాధ్యతలు చేపట్టారు. మిగిలిన పీలేరు, కలికిరి, కలకడలో సోమవారం ప్రమాణ స్వీకార కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ఈ కార్యక్రమాలకు హాజరు కానున్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు కలికిరిలో చైర్మన్‌గా నల్లారి చంద్రకుమార్ రెడ్డితోపాటు మరో ఇద్దరు సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అనంతరం 10 గంటలకు కలకడలో వెంకట్రమణ నాయుడు సభ్యులతో బాధ్యతలు చేపట్టనున్నారు. ఆ తరువాత 12 గంటలకు పీలేరు సింగిల్ విండో అధ్యక్షుడుగా రెడ్డెప్పరెడ్డి, ఇతర సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కాగా మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, టీడీపీ వివిధ విభాగాల కార్యవర్గాలు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని టీడీపీ మండల అధ్యక్షుడు నిజాముద్దీన్ పిలుపునిచ్చారు

అదృశ్యమైన మహిళ ఆత్మహత్య


నాగజ్యోతి మృతదేహం

దువ్వూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కనిపించకుండా పోయిన ఓ మహిళ మృతదేహం ఆదివారం కేసీ కాలువలో లభ్యమైంది. పోలీసుల కథనం మేరకు తన భార్య నాగజ్యోతి (27) కనిపిం చడం లేదంటూ దువ్వూరులోని ఇందిరమ్మ కాలనీకి చెందిన హరి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసీ కాలువ వద్ద ఆమె చున్నీ కనిపించడంతో ఆత్మహత్యకు పాల్పడిందేమోనన్న అనుమానం తో కేసీ కెనాల్ అధికారులతో మాట్లాడి కాలువలో ప్రవాహం తగ్గించారు. దీంతో ఆదివారం ఉదయం భీమునిపాడు స్లూయిస్ వద్ద ఆమె మృతదేహం తేలింది. మృతదేహాన్ని ప్రొద్దుటూరు ఆస్పత్రికి తరలించారు. ఆమె ఆత్మహత్యతో ఆమె ఇద్దరు కూతుళ్లు అయిదేళ్ల తన్విక, మూడేళ్ల నైనిక తల్లిప్రేమకు దూరమయ్యారు.

బుద్ధుడి విగ్రహం ధ్వంసంపై చర్యలు తీసుకోవాలి
● డీపీఐ నేత తిరుమావళవన్ ఆగ్రహం


మీడియాతో మాట్లాడుతున్న డీపీఐ నేత తిరుమావళవన్

చెన్నై, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లె సమీపంలో ఉన్న కొండపై బుద్ధుడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన శక్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డీపీఐ నేత తొల్ తిరుమావళవన్ డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం నగరంలోని పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుమారు 20 సంవత్సరాల నుంచి మదనపల్లెలో బుద్ధ పూర్ణిమ కార్యక్రమాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీపీఐ ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నారని, ఆయనను రాజకీయంగా ఎదుర్కొలేక కొంతమంది ఆ విగ్రహాన్ని ధ్వంసం చేశారని, ఆ సంఘటనను ఖండిస్తూ ఆందోళనకు దిగిన శివప్రసాద్‌పై కేసులు నమోదు చేయడం గర్హనీయమన్నారు. బుద్ధుని విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తులను అరెస్టు చేసి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ చర్యలను ఖండిస్తూ ఆగస్టు 23 న విజయవాడలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డీపీఐ పార్టీ నిర్వాహకులతో కలిసి ధర్నా చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. మీడియా సమావేశంలో పార్టీ నేతలు బాలసింగం, వన్నియరసు, పీటీఎం శివప్రసాద్, యూ.గణపతి తదితరులు పాల్గొన్నారు.

అతిగా మద్యం తాగి ఇద్దరు మృతి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి):వేరువేరు ప్రాంతాల్లో మద్యానికి బానిసలైన ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. మండలంలోని బసినికొండకు చెందిన లక్ష్మన్న కుమారుడు పవన్(40)కు పదేళ్ల క్రితం భారతితో వివాహం జరిగింది. పెళ్లైన ఏడాదికే ఆమె మృతి చెందగా, అప్పటి నుంచి మద్యానికి బానిసై పనులకు వెళ్లకుండా ఉండేవాడని, ఆదివారం బసినికొండ పెట్రోల్ బంకు సమీపంలో మద్యం అతిగా తాగి అక్కడే పడి చనిపోయాడు. గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పట్టణంలోని మార్పురి వీధికి చెందిన ఖాదర్ బాషా కుమారుడు షరీఫుద్దీన్ (38)మద్యానికి బానిసయ్యాడు. అతని భార్య హమీదా కూలి పనులు చేస్తుండగా, ఇతను చెడు తిరుగుళ్లు తిరుగుతూ ఉండేవాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం భార్య పనికి వెళ్లి వచ్చేసరికి భర్త అపస్మారక స్థితిలో కనిపించాడు. వెంటనే అతనిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని ఇంటికి తరలించారు

ఆసక్తికరంగా జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు


పరుగు పోటీలో పాల్గొన్న క్రీడాకారులు


హైజంప్ చేస్తున్న యువకుడు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలో అండర్-14, 16 జిల్లా స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు ఆసక్తికరంగా సాగాయి. బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడవ తేదీ ఉదయం జరిగిన పోటీలకు జిల్లా వ్యాప్తంగా 350 మంది క్రీడాకారులు హాజరయ్యారు. బాలబాలికలకు 60, 600 మీటర్ల రన్నింగ్, లాంగ్‌జంప్, జావెలిన్ త్రో, షాట్‌పుట్, హైజంప్, ట్రైయథ్లాన్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందినవారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. పోటీల్లో ప్రతిభ కనపరిచిన 30 మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారు ఈనెల 9, 10, 11 తేదీల్లో బాపట్లలో జరిగే ఏపీ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ కార్యదర్శి అహమర్‌బాష తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ సంచాలకులు నాగూర్‌బాష, శివారెడ్డి, శంకర్, నరేష్, ఎర్రన్న, చందు, నాగేశ్వరరావు, ఖాదర్‌రెడ్డి, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

విభిన్నప్రతిభావంతులకు పరికరాలు


దివ్యాంగుల అర్హత పత్రాలను పరిశీలిస్తున్న అధికారి అజయ్

కడప కలెక్టరేట్, ఆగస్టు 3,(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం దివ్యాంగులకు, విభిన్న ప్రతిభావంతులకు పరికరాలు పంపిణీ చేస్తోందని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలనీ అధికారి అజయ్ సూచించారు. ఆదివారం శంకరాపురంలోని అంధుల పాఠశాలలో జేకే వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పఠాన్ ఖాదర్ బాషాతో కలసి దివ్యాంగుల దరఖాస్తులను పరిశీలించి, ఆన్లైన్‌లో అప్‌లోడ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వం సౌజన్యంతో కాన్పూర్‌కు చెందిన కృతిమ అవయవాల తయారీ సంస్థ, విభిన్న ప్రతిభావంతులు, వృద్ధుల సంక్షేమ శాఖల సంయుక్తంగా చేతి కర్రలు, మూడు కాళ్ల చేతికర్రలు, వాకర్లు, నాలుగు కాళ్ల చేతి కర్రలు, చంక కర్రలు, వీల్ చైర్లు, ట్రైసైకిళ్లు, బ్యాటరీ ట్రైసైకిళ్లు. వినికిడి పరికరాలతో పాటు రోలేటర్లు, ఎమ్మెస్ కిట్లు, అంధులకు వాచీలు, వాయిస్ ఫోన్లు తదితర పరికరాలను అందజేస్తారన్నారు.

యువకుడిపై కత్తితో దాడి
● పరారీలో నలుగురు యువకులు


రిమ్స్‌లో చికిత్స పొందుతున్న చాన్‌బాషా

కడప క్రైం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి):కడప నగరం మురాదియా నగర్‌కు చెందిన షేక్ చాన్‌బాషాను కత్తితో పొడిచి గాయ పరిచినట్లు తాలూకా పోలీసులు తెలిపారు. బాధితుడి కుటుంబ సభ్యుల కథనం మేరకు చాన్‌బాషా వంట పనులు చేయడంతోపాటు సాయంత్రం పూట జీవాలు మేపుతుంటాడు. ఆది వారం సాయంత్రం జీవాలు మేపే సమయంలో గుర్రాల గడ్డ ప్రాంతం నుంచి వచ్చిన నలుగురు యువకులు చాన్‌బాషాతో గొడవకు దిగారు. ఆపై వారి వద్ద ఉన్న కత్తితో మూడు చోట్ల పొడిచి అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న తెలిపారు.

టీడీపీ నాయకుడిపై వైసీపీ వర్గీయుల దాడి


దాడిలో గాయపడిన చుక్కా కొండయ్య తదితరులు

నందలూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రేషన్ షాపును అందరికీ అనుకూలమైన ప్రదేశానికి మార్చాలని డిమాండ్ చేసినందుకు టీడీపీ నాయకుడు చుక్కా కొండయ్య, మరికొంతమందిపై వైసీపీ నాయకులు దాడి చేశారు. ఈ సంఘటన చింతకాయల పల్లెలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు... చింతకాయలపల్లెకు చెందిన రేషన్ షాపు కుందానెల్లూరులో ఉంది. ఆ గ్రామంలో 50 రేషన్ కార్డులు మాత్రమే ఉన్నాయి. చింతకాయలపల్లె, మదనమోహనపురం, కొత్తచాపల వారిపల్లె గ్రామాలకు చెందిన సుమారు 600 మంది రేషన్‌కార్డుదారులు కుందా నెల్లూరుకు వెళ్లి రేషన్ తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రేషన్ షాపును చింతకాయలపల్లెలో ఏర్పాటు చేస్తే అందరికీ అందుబాటులో ఉంటుందని టీడీపీ నేత చుక్కా కొండయ్య సంబంధిత అధికారులకు విన్నవించారు. ఈ విషయం తెలిసిన చింతకాయలపల్లెకు చెందిన వైసీపీ నాయకుడు గంగినాయుడు ఆయన బంధువులు సుమారు 20 మంది చుక్కా కొండయ్య, అతని బంధువులపై దాడికి పాల్పడ్డారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసుల ఎదుట కూడా తమపై దాడి చేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

నాడు ఊరికే తలమానికం..
నేడు శిథిల గృహం!
● ములకలచెరువులో మొట్టమొదటి కట్టడం





ములకలచెరువు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): బ్రిటిష దొరలు మార్గమధ్యంలో సేదతీరేందుకు 120 ఏళ్ల క్రితం నిర్మించుకున్న కట్టడం కారణంగానే ములకలచెరువు గ్రామం ఏర్పడింది. చాలా కాలం వరకూ ఒక వెలుగు వెలిగిన ఈ భవనం పట్టించుకునేవారు లేక ప్రస్తుతం శిథిల గృహంగా దర్శనమిస్తోంది.
ములకలచెరువులోని బస్టాండు సర్కిల్ సమీపంలోని ముంబై - చెన్నై జాతీయ రహదారి పక్కన ప్రస్తుతం ఓ పాడుబడిన ఓ బంగ్లా కనిపిస్తుంది. ఇక్కడ ఊరే లేని సమయంలో ఈ మార్గంలో రాకపోకలు సాగించే తెల్లదొరలు తాము విశ్రాంతి తీసుకునేందుకు ఇక్కడ బంగ్లాను నిర్మించారు. కాలక్రమంలో ఇక్కడ రైల్వేస్టేషన్ నిర్మించడంతో ఊరు ఏర్పడింది. బ్రిటిష దొరల తరువాత ఈ మార్గంతో వెళ్లే మంత్రులు, ముఖ్య నాయకులు, ఉన్నతాధికారులు ఇక్కడే విశ్రాంతి తీసుకునేవారు. ప్రస్తుతం నిర్వహణ లేకపోవడంతో బంగ్లా రూపురేఖలే మారిపోయాయి. పాలకులెవరూ పట్టించుకోక పోవడంతో ఎందుకూ పనికిరాకుండా పోయింది. బంగ్లా గోడలు కూలిపోతున్నాయి. బంగ్లా ఆవరణ చెత్తాచెదారంతో నిండిపోయింది. పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో అక్కడ బంగ్లా ఉన్న ఆనవాళ్లు కూడా కనిపించడం లేదు. బంగ్లా ముందు దుకాణాలు ఏర్పడడంతో కనుమరుగైంది. ఉన్నతాధికారులు స్పందించి ఈ బంగ్లాను పునరుద్ధరించడమో, దీన్ని తొలగించి కొత్త భవనాలు నిర్మిస్తే ఏదైనా ప్రభుత్వ కార్యాలయానికి వినియోగించుకోవచ్చని స్థానికులు చెబుతున్నారు.

నేడు నారవమాను గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ

మదనపల్లె అర్బన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పనసమాకులపల్లెలో సోమవారం నారవమాను గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం విగ్రహ ప్రతిష్ఠ, అనంతరం మహా పూర్ణాహుతి, కుంభాభిషేకం, పంచామృతాభిషేకం, మంగళహారతి, విశేషపూజలు నిర్వహిస్తారన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

వ్యక్తికి గాయాలు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని బార్లపల్లె వద్ద జరిగిన ఆదివారం రోడ్డుప్రమాదంలో వ్యక్తికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె మండలం వేంపల్లె దళితవాడకు చెందిన శంకర (52)బెంగళూరు రోడ్డులో సప్లయ్ షాపు నిర్వహిస్తున్నాడని తెలిపారు. ఆదివారం ద్విచక్రవాహనంపై చీకులబైలుకు వెళ్తుండగా బార్లపల్లె వద్ద లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన శంకరను స్థానికులు మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం డాక్టర్లు తిరుపతికి రెఫర్ చేశారు. ఈ విషయంపై తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

బి.కొత్తకోట, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనంలో వెళుతూ రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలపాలైన సంఘటన ఆదివారం బి.కొత్తకోట మండలంలో చోటుచేసుకుంది. సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతికి చెందిన వెంకటేష్(25) సొంత పనిమీద ద్విచక్ర వాహనంలో బి.కొత్తకోట వచ్చాడు. తిరుగు ప్రయాణంలో హార్సిలీహిల్స్ సమీపంలోని ఈడిగపల్లి వద్ద ఎదురుగా వస్తున్న టాటాఏస్ వాహనాన్ని ఢీకొన్నాడు. తలకు బలమైన గాయాలు కావడంతో 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దొంగల స్వైర విహారం

- యర్రగుంటపల్లెలో స్టార్టర్లు, కేబుల్ వైర్ల చోరీ
- ఆందోళనలో రైతులు


దొంగలు కేబుల్ ఎత్తుకెల్లిన మురళీమోహన్ రెడ్డి వ్యవసాయ బోరు

పీలేరు రూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పీలేరు మండలం యర్రగుంటపల్లె పంచాయతీలో దొంగలు స్వైర విహారం చేస్తున్నారు. వారం రోజుల వ్యవధిలో 15 వ్యవసాయ బోర్ల వద్ద చోరీలకు పాల్పడ్డారు. దీంతో రైతులకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. పోలీసులకు సమాచారం ఇచ్చినా ఎటువంటి ప్రయోజనం లేదని బాధిత రైతులు వాపోతున్నారు. వ్యవసాయ బోర్ల వద్ద ఏర్పాటు చేసిన స్టార్టర్లు, కేబుల్ వైర్లను రాత్రికి రాత్రే దొంగలు దోచుకెళ్తున్నారు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. ముదుపుల వేములవారిపల్లె రైతు మురళీమోహన్ రెడ్డికి నాలుగు వ్యవసాయ బోర్లు ఉన్నాయి. జూలై 31వ తేదీ రాత్రి నాలుగు బోర్లవద్ద దొంగలు కేబుల్ వైర్లు కట్ చేసి ఎత్తుకెళ్లారు. రెండు రోజుల వ్యవధిలో వాటి మరమ్మతులు చేయించారు. అయితే ఆదివారం తెల్లవారేసరికి నాలుగు బోర్ల వద్ద మళ్లీ దొంగలు కేబుల్ వైర్లు దోచుకెళ్లారు. దీంతో రైతుపై మోయలేని భారం పడింది. యర్రగుంటపల్లె ఎంపీటీసీ అమరనాథరెడ్డి వ్యవసాయ బోరు వద్ద రూ.30 వేల విలువైన కేబుల్ వైర్లు, ఇత్తడి కప్లింగ్‌లు అపహరించారు. ఆనంద్‌రెడ్డి, యర్రంరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎం.భానుప్రకాష్‌రెడ్డి బోర్ల వద్ద కూడా కేబుల్ వైర్లు, స్టార్టర్లు చోరీ చేశారు. ముదుపులవేములవారిపల్లె తాగునీటి పథకం బోరు కేబుల్ వైర్, ఆంజనేయస్వామి ఆలయం వద్ద బోరు స్టార్టర్లు, కేబుల్ వైర్లు అపహరించుకుపోయారు. పీలేరు అర్బన్ పోలీసులు దొంగల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి ఆటకట్టించాలని రైతులు కోరుతున్నారు.

కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు..



వ్యవసాయ బోర్ల వద్ద దొంగలు చోరీలకు పాల్పడుతూ కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. మూడు రోజుల వ్యవధిలో రెండుసార్లు నాలుగు మోటర్ల వద్ద కేబుల్ వైర్లు ఎత్తుకెళ్లారు. గ్రామంలో దొంగల బెడద అధికమైంది. రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పోలీసులు నిఘా పెట్టి దొంగల ఆటకట్టించాలి.

- మురళీమోహన్ రెడ్డి,ముదుపులవేములవారిపల్లె


వ్యవసాయ బోరు వద్ద డోర్ పగలుగొట్టి స్టార్టర్ ఎత్తుకెళ్లిన దృశ్యం

సమాజ మార్గనిర్దేశకులు ఉపాధ్యాయులు

- సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ పాత్ర కీలకం
- డీవైఈవో లోకేశ్వర్ రెడ్డి
- యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు ప్రారంభం


సమావేశంలో మాట్లాడుతున్న మదనపల్లె డీవైఈవో లోకేశ్వర్ రెడ్డి

పీలేరు రూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): సమాజానికి ఉపాధ్యాయులు మార్గ నిర్దేశకులని మదనపల్లె డీవైఈవో లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులకు చెస్, క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ లోకం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆవిర్భవించిన యూటీఎఫ్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెన్నుదన్నుగా నిలవడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో యుటీఎఫ్ పాత్ర కీలకమని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువు నేర్పడంతో పాటు ఆటవిడుపుగా క్రీడల్లో భాగస్వాములు కావడం శుభపరిణామమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థుల ఉజ్వల భవితకు బంగారు బాటలు వేయాలని సూచించారు. విద్యాదానం కన్నా మించింది మరొకటి లేదన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబిద్, కోశాధికారి చంద్రశేఖర్, జిల్లా గౌరవాధ్యక్షుడు సుధాకర్ నాయుడు, జిల్లా కార్యదర్శులు అక్రం భాషా, రమణమూర్తి, స్పోర్ట్స్ కన్వీనర్ సుధాకర్, మండల అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

క్లస్టర్ సూపర్‌వైజర్‌కు పదోన్నతి

తంబళ్లపల్లె, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో కురబలకోట క్లస్టర్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న ఎస్.శాంతమ్మ సీడీపీవోగా పదోన్నతి పొందారు. వైఎస్సార్ కడప జిల్లా సీకే దిన్నె సీడీపీవోగా నియమిస్తూ ప్రాజెక్టు డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. శాంతమ్మకు పదోన్నతి రావడంపై తంబళ్లపల్లె, మదనపల్లె ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని రైతు దుర్మరణం

ములకలచెరువు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ రైతు దుర్మరణం చెందిన సంఘటన ఆదవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... మండంలోని బురకాయలకోట పంచాయతీ ఎర్రమాసివారిపల్లెకు చెందిన శ్రీనివాసులునాయుడు(45) ద్విచక్రవాహనంలో ములకలచెరువులో జరుగుతున్న బంధువుల వివాహానికి హాజరయ్యాడు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ముంబాయి-చెన్నై జాతీయ రహదారిలోని బురకాయలకోట పెట్రోల్ బంకు సమీపంలో ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాసులునాయుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ద్విచక్రవాహనంలో వెనుక కూర్చున్న రిజ్వాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ నరసింహుడు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యోగ నేలమల్లేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్థంభ ప్రతిష్ఠ

నిమ్మనపల్లి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని తవళం అటవీ ప్రాంతంలో వెలసిన యోగ నేలమల్లేశ్వరస్వామి ఆలయం ఎదుట ఆదివారం ధ్వజస్థంభ ప్రతిష్ఠతో పాటు శిఖర కలశ ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా ఉదయం స్వామివారికి దీక్షా హోమం, మహా మంగళహారతి, సాయత్రం రుద్రదుర్గా, సరస్వతి హోమం కార్యక్రమాలు నిర్వహించారు, సోమవారం ఉదయం కామేశ్వరి అమ్మవారు, గణపతి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత హైకోర్టు జడ్జీ పిఎస్ నారాయణ, సర్పంచ్ రెడ్డెప్ప, ఏవో మంజుల, నిర్వహకుడు రామకష్ణ పాల్గొన్నారు.



గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి


మాట్లాడుతున్న సర్పంచ్ పసుపులేటి చలపతి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని చిప్పిలి గ్రామ సర్పంచ్ పసుపులేటి చలపతి పిలుపునిచ్చారు. ఆదివారం గ్రామ వార్షిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చలపతి మాట్లాడుతూ వార్షిక ప్లాన్ ప్రకారమే గ్రామాభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే గ్రామంలో మంచి నీటి సౌకర్యం, విద్యుత్ దీపాలు, సిమెంట్ రోడ్లు, మురుగునీటి కాలువ ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు సౌకర్యవంతంగా పనులు చేస్తున్నామని, దోమల బెడద లేకుండా ఫాగింగ్ చేస్తునట్లు వివరించారు. కార్యక్రమంలో గ్రామ సెక్రటరీ, వార్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి సమష్టి కృషి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితో ఆర్టీసీని అభివృద్ధి బాటలో నడిపిద్దామని, అలాగే కూటమి ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం పథకంపై అవగాహన కల్పిద్దామని మదనపల్లె 1, 2 ఈయూ యూనియన్ అధ్యక్షుడు నాగూర్‌వలి అన్నారు. ఆదివారం స్థానిక యూనియన్ కార్యాలయం వద్ద డిపోల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈయన మాట్లాడుతూ ఆర్టీసీ డిపోల అభివృద్ధి బాధ్యత అధ్యక్ష, కార్యదర్శులదేనన్నారు. బస్టాండ్‌లో పూర్తి స్థాయి సిమెంట్ రోడ్లు, అధునాతనమైన మరుగు దొడ్లు, మహిళా ఉద్యోగులకు ప్రత్యేక విశ్రాంతి గదులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. డిపోల్లో నెలకొన్న సమస్యలపై మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో రీజినల్ కమిటీ నాయకులు ప్రకాష్, వీఎస్ అలీ, జిల్లా నాయకులు సీపీ బాబు, రెండు డిపోల అధ్యక్ష, కార్యదర్శులు ముధు, హుసేన్, శేఖర్, సూరిబాబు పాల్గొన్నారు.

బడా బాబుల కోసం రైతులు, కార్మికులకు అన్యాయం

- సీపీఐ మహాసభలో నాయకుల ధ్వజం

బి.కొత్తకోట, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారులు, బడాబాబులకు కొమ్ముకాస్తూ పేదరైతులు, కార్మికులు, కర్షకులకు తీరని అన్యాయం చేస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు ధ్వజమెత్తారు. ఆదివారం పట్టణంలో సీపీఐ నియోజకవర్గ స్థాయి మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాల తీరు పేదల నోళ్లు కొట్టి ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రైవేటుపరం చేసే దిశగా వుంటున్నాయని, ఇది తీవ్ర అభ్యంతరకరమన్నారు. దళితులు, మహిళలు, మైనార్టీవర్గాల మీద జరుగుతున్న దౌర్జన్యాలు, దమనకాండలను ఖండిస్తూ గళం విప్పేది సీపీఐ మాత్రమేనన్నారు. విధ్యుత్ చార్జీలు పెంచబోమంటూ అధికారంలోకి రాగానే పెంచడం, స్మార్ట్‌మీటర్లు పెట్టడం ప్రభుత్వాలకు అలవాటుగా మారిందన్నారు. అంతకు మునుపు తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన కార్యకర్తలు, కార్మిక నాయకులతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మహాసభల సందర్భంగా బి.కొత్తకోటలోని ప్రధాన కూడలి జ్యోతిసర్కిల్, మెయిన్ రోడ్లు ఎర్రజెండాలతో ఎరుపెక్కాయి. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గసభ్యులు క్రిష్ణప్ప, సాంబశివ, మురళి, నాయకులు మాధవ్, హరికుమార్, అంజినప్ప, బషీర్‌ఖాన్, రఘునాథ్, సలీంబాష, అమరావతి, కార్యకర్తలు పాల్గొన్నారు.



బి.కొత్తకోటలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

ఘనంగా కొణిదల లోకేశ్ జన్మదిన వేడుకలు


పేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేస్తున్న ఎన్ఆర్ఐ కొణిదల లోకేశ్

మదనపల్లె అర్బన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కొణిదల లోకేష్ జన్మదినం సందర్భంగా ఆదివారం పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా బైపాస్ రోడ్డులో కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. అనంతరం ఆర్అండ్ బీ బంగ్లాలో మదనపల్లె ఆర్టీసీ డిపోల ఈయూ గౌరవాధ్యక్షుడు నాగూర్‌వలి, రాష్ట్ర హజ్‌కమిటీ సభ్యుడు, టీడీపీ మైనార్టీ నాయకుడు పఠాన్‌ఖాదర్‌ఖాన్ ఆధ్వర్యంలో లోకేశ్ కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా లోకేశ్‌కు టీడీపీ నాయకులు, మిత్రులు, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శ్రీదేవి గార్డెన్స్‌లో టీడీపీ నాయకులు డాన్స్‌రెడ్డెప్ప, రామకృష్ణ, పురుషోత్తం, యర్రపల్లె వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. పేద విద్యార్థులకు లక్ష రూపాయలు, అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి రూ.10వేల ఆర్థిక సాయాన్ని ఎన్ఆర్ఐ కొణిదల లోకేశ్ అందించారు. కార్యక్రమంలో పెరవలి నవీన్, నిరంజన్, వంశీ, మహేష్ రాటకొండ గగన్, నరసింహ, ఖాదర్‌ఖాన్, కోనభాస్కర, మేస్రీ శ్రీనివాసులు, రాటకొండ మధుబాబు, పురుషోత్తమ్, డాన్స్‌రెడ్డెప్ప, టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముదివేడులో...

కురబలకోట, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత కొణిదల లోకేశ్ జన్మదిన వేడుకను మండలంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ముదివేడు బస్టాండు కూడలిలో ఆదివారం రాజంపేట పార్లమెంటరీ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి అయూబ్ భాషా ఆధ్వర్యంలో కొణిదల లోకేశ్ కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా పేద విద్యార్థులకు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి, రాజంపేట పార్లమెంటరీ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి అయూబ్ బాషా, మాజీ ఎంపీటీసీ భూమిరెడ్డి, మోహన్‌రెడ్డి, ఇందాద్, తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థి సంఘాలను అడ్డుకోవడం ప్రజాస్వామ్యాన్ని అడ్డుకోవడమే'

మదనపల్లె టౌన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థి సంఘాలను అనుమతించవద్దంటూ పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులు ప్రజాస్వామ్యానికి అడ్డుకోవడమేనని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ వాపోయారు. ఆదివారం స్థానిక జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోకి పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు మినహా ఇతరులు వెళ్లకూడదని ఉత్తర్వులు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. విద్యాహక్కు చట్టాన్ని కాలరాస్తున్న ఈ పరిస్థితుల్లో విద్యార్థి సంఘాల పోరాటాలతోనే విద్యారంగం బాగుపడుతున్న విషయాన్ని అధికారులు విస్మరించారన్నారు. వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సమీర్, అర్జున్, శ్రీధర్‌నాయక్ పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ


వీరభద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజాకార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

తంబళ్లపల్లె, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలం కన్నెమడుగు పంచాయతీ చిన్నమాచిరెడ్డిగారిపల్లెలో నూతనంగా నిర్మించిన వీరభద్రస్వామి ఆలయంలో రెండు రోజులుగా విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాలు గ్రామస్థులు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నూతన ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలు, పుష్పాలతో సుందరంగా అంకరించారు. మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యం, యాగశాల పూజ, నవగ్రహ హోమం, రుద్రహోమం, సాయంత్రం పుణ్యహవచనం, యాజమాన సంకల్పం, పంచగవ్యం, అష్టబంధన స్థాపనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాగా సోమవారం ప్రాణప్రతిష్ఠ, మహాకుంబాభిషేక మహోత్సవం నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు.

గురుకులంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బి.కొత్తకోట, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చంద్రమాకులపల్లె సమీపంలో వున్న ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. 1996 నుంచి ఇక్కడ విద్యను అభ్యసించిన విద్యార్థులు పెద్దసంఖ్యలో ఇక్కడికి చేరుకుని ఆనాటి మిత్రులతో సరదాగా గడిపారు. అలనాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. అప్పటి గురువులను సత్కరించుకున్నారు. ఇంతకాలం ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన వాసుదేవరావు ఉద్యోగవిరమణ కార్యక్రమాన్ని సైతం ఘనంగా నిర్వహించారు. విధి నిర్వహణలో ఆయన అంకితభావాన్ని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో అప్పటి ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్, వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రావు,జడ్డి రామక్రిష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైభవంగా జీకే నేచర్ వ్యాలీ ప్రారంభం

మదనపల్లె, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మదనపల్లె-పుంగనూరు జాతీయ రహదారికి సమీపంలోని జీకే నేచర్ వ్యాలీని ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, పట్టణ ప్రముఖులు, ఉద్యోగులు, వ్యాపారులు, రైతులు, రియల్ వ్యాపారులు, తదితరులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. 42 ఎకరాల విస్తీర్ణంలో రియల్ వ్యాపారులు గోపాల్‌రెడ్డి, టి.కృష్ణప్పనాయుడు(టీకేఎన్) సువిశాలమైన ప్రదేశంలో వెంచర్ ఏర్పాటు చేశారు. పచ్చదనం-పరిశు భ్రత, కాలుష్యనివారణ, ఆహ్లాదకర, ప్రశాంత వాతావరణంలో అన్ని హంగులతో ఉన్న నేచర్‌వ్యాలీని కనులపండుగగా ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమంలో పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీరామ్‌చినబాబు, మాజీ ఎమ్మెల్యేలు దేశాయ్ తిప్పారెడ్డి, దొమ్మలపాటి రమేష్, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి, జనసేన రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామ్‌దాస్‌చౌదరి, మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివరామ్, కురవంక సర్పంచి పుసులేటి చలపతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, రిటైర్డ్ డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి, ఎమ్మెల్యే సోదరుడు జంషీర్, వి.కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎన్నారై మాధవరెడ్డి, కను గొండ, రాజేష్, హరి, తదితరులు పాల్గొన్నారు.


వెంచర్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి, నిర్వాహకులు గోపాల్‌రెడ్డి, టీకేఎన్, రామ్‌దాస్‌చౌదరి, నరేశ్‌కుమార్‌రెడ్డి, తదితరులు